# అంత్యోదయం

తలుపు కొట్టిన చప్పుడుతో రమణమూర్తికి మెలకువ వచ్చింది. తలుపుతీసి చూస్తే ఎదురుగా ఖాకీబట్టల్లో టెలిగ్రాఫ్ మెసెంజర్.

అతన్ని చూడగానే రమణమూర్తికి ఆనందం, ఆందోళన ఒకేసారి కల్గాయి. భార్యకు పురుడు వచ్చివుంటుందన్న ఊహతో ఆనందం. భార్య ఎలా వుందోనని ఆలోచించేసరికి ఆందోళన...

సంతకంచేసి టెలిగ్రాం తీసుకున్నాడు. చదివాక శుభమైతే మెసింజర్‌కో రూపాయి ఇద్దామనుకున్నాడు. అతనేమీ ఆశించకుండా సైకిలెక్కి వెళ్ళిపోయేసరికి రమణమూర్తికి భయం వేసింది.

వణుకుతున్న చేతులతో టెలిగ్రాం విప్పి చదివాడు.

"యువర్ ఫాదర్ సీరియస్. స్టార్ట్."

రమణమూర్తికి గొంతు తడారిపోయింది. అంత చలిలోను అతనికి దాహమేసింది. చేతులానుకుని కుర్చీలో కూర్చిండి పోయాడు.

అతను కాసేపు ఏమీ ఆలోచించలేక పోయాడు. మనసు కుదుట పడి తండ్రి గురించి ఆలోచించేసరికి అతనికి దుఃఖం ముంచు కొచ్చింది.

ఓ అరగంటకి అతనికి చెయ్యాల్సినది గుర్తుకొచ్చింది. ఆ సమయంలో అతనికి ధైర్యం చెప్పి సలహా చెప్పే మనిషి అవసరం కనిపించింది. బట్టలేసుకుని రత్నాకరం ఇంటికి వెళ్లాడు. వాళ్ళిద్దరూ ఒకే ఆఫీసులో పన్జేస్తున్నారు.

రత్నాకరం మిత్రునికి గొప్పధైర్యం చెప్పాడు. ఏదో సలత అయిఉంటుందన్నాడు. కంగారుపడాల్సింఁదేమీ లేదన్నాడు. ఆయన తప్పకకులాసాగా తిరుగుతారన్నాడు. నువ్వు నవ్వుతూ ఇంటికి తిరిగివస్తావన్నాడు. ఎన్నో అన్నాడు.

"తగ్గుతుందంటావా?"

"ఆయన మళ్లీ మామూలు మనిషిలా తిరుగుతాడంటావా?

రమణమూర్తి రత్నాకరాన్ని ఇలాంటి ప్రశ్నలు చాలా అడిగాడు.

అసలతని తండ్రికి ఏం జబ్బుచేసిందో, ఎందుకంత సీరియస్‌గా వుందో ఇద్దరిలో ఎవరికీ తెలియదు.

కాని, కష్టంలో ఉన్నప్పుడు మిత్రుడు చేప్పే చిన్నమాటైనా చీకట్లో చిరుదీపంలా గొప్ప ధైర్యాన్నిస్తుంది.

రత్నాకరం రమణమూర్తిని దగ్గరుండి ఆఫీసుకి తీసుకెళ్లాడు. అతనిచేత శలవు పెట్టించాడు. బ్యాంకికి తీసుకెళ్ళి డబ్బు విత్‌డ్రా చేయించాడు. అది చాలదేమోనని తన దగ్గరున్న డబ్బు కొంత ఇచ్చాడు. కూడా స్టేషన్‌కెళ్ళి ట్రైన్ ఎక్కించాడు. ట్రైన్ కదిలేదాకా ఉన్నాడు మధ్యలో ధైర్యవచనాలు చాలా చెప్పాడు.

ట్రైన్ కదిలేముందు "నీకూడా వచ్చేవాణ్ని. మా పిల్లాడికి మరీ బాగుండలేదు. అంచేత సంశయిస్తున్నాను" అన్నాడు.

ట్రైన్ కదిలాక రమణమూర్తికి బెంగ ఎక్కువయ్యింది. గుండె ల్లోంచి ఏదో బాధ మొదలైంది. అది మానసికమో, శారీరకమో అతని కర్థంకాలేదు. అంతవరకు తనతో ఉన్న రత్నాకరం ఆక్షణంలో లేడనుకునే సరికి అతనికి వంట్లోంచి వణుకుపుట్టుకొచ్చింది. ఈ ప్రపంచంలో తన కెవరూ లేరనిపించింది. ఆ కంపార్టుమెంటులో వున్నవాళ్ళంతా అతనికి మనుషుల్లా అనిపించలేదు. రాతి బొమ్మల్లా కనిపించారు. ఒక్కడూ తన బాధ కనుక్కోడు, తన గురించి పట్టించుకోడు.

ఛీ వెదవ మనుషులు....

రమణమూర్తికి తండ్రి కళ్ళముందు కదుల్తున్నాడు.

ఆరోజు టెలిగ్రామ్ వచ్చినప్పట్నించి జరిగిన సంఘటనలన్నీ అతని కళ్ళముందు సీరియల్‌గా కదుల్తున్నాయి.

టెలిగ్రాం వస్తే తనకి కొడుకు పుట్టాడనుకున్నాడు. కొడుకుపుడితే వాడికి తన తండ్రిపేరు పెడదామనుకున్నాడు.

మరో పార్వతీశం పుడతాడనుకుంటే ఉన్న పార్వతీశం.... రమణ మూర్తి ఇక ఆలోచించలేకపోయాడు. అతనికి తండ్రి పోయాడనిపించ టంలేదు. టెలిగ్రాం జేబులోంచి తీసి మళ్లీ చదివాడు.... 'యువర్ ఫాదర్ సీరియస్....'

అంతే! సీరియస్‌గా వుండివుంటుంది, పోయివుండడు. ఆయన

మళ్లీ కోలుకుంటాడు తనకు పెద్దదిక్కు ఉంటుంది. కిటికిల్లోంచి బైటికి చూశాడు. సూర్యుడు ఎంత మండించేస్తున్నాడు. అతనికి చిన్నప్పుడు తండ్రి నేర్పిన ఆదిత్య హృదయం జ్ఞాపకానికొచ్చింది. మనసులో చదువు కోడం మొదలెట్టాడు.

శ్రీరామచంద్రుడు రావణాసురుని మీదకు యుద్దానికి వెళ్లేముందు ఆదిత్య హృదయం స్మరించాట్ట. శ్రీరామచంద్రునికి గెలుపు లభించింది. అయితే ఇప్పుడు తన తండ్రికి మృత్యువు మీద విజయం లభిస్తుంది. ఒక్క సూర్యభగవానుడే కాదు రమణమూర్తికి. తిరుపతి వెంకటేశ్వరుడు, బెజవాడ కనకదుర్గ, సింహాచలం నరసింహస్వామి .... చాలామంది దేవుళ్ళు గుర్తుకొచ్చారు అందర్నీ స్మరించాడు. ఏవో మొక్కులు మొక్కుకున్నాడు. అందర్నీ అడిగిన కోరిక ఒకటే.... "మా నాన్న లేకుండా నేను బతకలేను. ఆయన్ని నానుంచి తీసుకు పోకండి....ప్లీజ్"

ఇన్నాళ్ళు తండ్రి తన దగ్గరే లేకపోయినా, ఆయన ఉన్నాడన్న నైతిక బలంతో తనకు పెద్దదిక్కు ఉందన్న ధైర్యంతో ఎంతో తృప్తిగా అనిపించేదతనికి.

తండ్రిని తనతోపాటు వుండమని చాలాసార్లు అడిగాడతను. కాని ఆయనకు సొంతవూరు వదిలిరావటం ఇష్టంలేదు పట్నవాసంలో అన్నిటికీ తడుముకుంటూ, చాలీచాలని ఇరుకు ఇళ్ళలో గాలి వెలుతురు లేని జీవితం ఆయనకి కిట్టదు.

ఆయన కొడుకుని, కోడల్ని చూడాలనిపించినప్పుడల్లా పట్నం వెళతాడు. రెండు రోజులుండి వెళ్ళిపోతాడు. ప్రతి పండగకు కొడుకు, కోడలు ఆయన దగ్గరకు వెళ్ళాల్సిందే. వాళ్ళకి మంచి బట్టలు కొంటాడు. డబ్బు ఇస్తాడు. ప్రేమ, ఆప్యాయత చూపిస్తాడు.

రమణమూర్తి తల్లి చిన్నప్పుడే పోయింది. అప్పట్నుంచి తండ్రి అన్నీ తనే అయి పెంచాడు. దగ్గర కూర్చో పెట్టుకుని నైతికసూత్రాలు చెప్పాడు. సాంఘిక బాధ్యతలు చెప్పాడు. ఇంగ్లీషు చెప్పాడు. లెఖ్ఖలు చెప్పాడు. రమణమూర్తిని మంచి కొడుకుగానే కాకుండా మంచి పౌరుడుగా తయారు చెయ్యడానికి శాయశక్తులా ప్రయత్నించాడు.

రమణమూర్తికి పదేళ్లు వచ్చేసరికి భగవద్గీత తాత్పర్యంతో సహా

నోటి. కొచ్చింది. అలాగని అతన్ని పూర్తిగా పురాతన పద్ధతుల్లో కాకుండా ఆధునిక కాలానికి అనుగుణంగా పెంచాడు. పాత కొత్తలో మంచి ఏమిటో చెప్పాడు. చదువుకోడం ఉద్యోగంలో చేరడం, దగ్గర్నుంచి రమణమూర్తి అన్నీ తండ్రి సలహా సంప్రదింపుల మీదే చేశాడు. ఆఖరికి అద్దెకున్న ఇల్లు మారడం విషయంలోకూడా తండ్రిని ఉత్తరం ద్వారా సంప్రదిస్తేగానీ చెయ్యడు. అలాగని అతని తండ్రి నియంతలాగ ప్రవర్తించడు. తన అభిప్రాయాలను, ఇష్టాయిష్టాలను వాళ్ళమీద బలవంతంగా రుద్దడు. తన దృష్టిలో ఏది మంచిదనిపిస్తే అది సలహాపూర్వకంగా చెప్తాడు.

ఆయన తన కొడుకు పెద్ద ఆఫీసరు కావాలని, ఏంతో డబ్బు సంపాయించాలని కోరుకోలేదు. తన కడుపున పుట్టినవాడు సంఘానికి సమస్య కాకుండా— సమాజానికి కాస్తో కూస్తో మంచి చేసేవాడు కావాలని కోరుకున్నాడు.

ప్రయాణం పూర్తయేవరకు రమణమూర్తిని తండ్రికి సంబంధించిన ఆలోచనలే చుట్టుముట్టాయి. పూర్తిగా ఆయనే గుర్తువచ్చాడు.

తన ఇల్లు వున్న వీధి మలుపు తిరిగేసరికి రమణమూర్తి గతుక్కుమన్నాడు. ఇంటిముందు జనం. గుమ్మం ముందు నిశ్చలంగా, ప్రశాంతంగా, భవబంధాల కతీతంగా పడుకుని వున్న తండ్రిని చూసేసరికి రమణమూర్తికి గుండె ఆగినట్టయ్యింది.

అయిపోయింది. అంతా అయిపోయింది. సింహాచలం దేవుడు దగ్గర్నుంచి తిరుమలేశుని వరకు ఎవరూ అతని మొర వినలేదు. అతని మొక్కులకు ఏ దేముడూ లొంగలేదు. ఆరిపోతున్న దీపాన్ని ఎవరూ ఆపలేకపోయారు.... అది ఆరిపోయింది. ఆయన తల దగ్గర దీపం....

"అదృష్టవంతుడు. తీసుకోకుండా పోయాడు."

"రాజాలా బతికాడు, రాజాలా పోయాడు."

"ఉన్న ఒక్కకొడుక్కి ఆఖరిచూపు దక్కితే బాగుండేది."

'బతికినన్నాళ్ళు అందరికీ చేతనైన సాయం చేశాడు.'

రమణమూర్తికి ఏమీ వినబడటంలేదు. వినబడినా ఏవీ అర్థం కావడం లేదు. అతను తల బద్దలు కొట్టుకుని ఏడుస్తాడనుకున్నారంతా....

అతని కసలు ఏడుపురావడం లేదు.... గొంతు పూడుకుపోయింది. నాలుక ఎండిపోయింది. శూన్యంలోకి చూస్తున్నాడు.

'ఇంకా ఆలస్యమెందుకు? తర్వాత కార్యక్రమాలు మొదలెట్టండి' అన్నారెవరో.

ఎవరు? ఎవరో? ఏమో....

ఎవరికెవరు? ఏమౌతారు? ఎన్నాళ్ళు? ఏమిటీ బంధాలు? ఎవరు సృష్టి చేసింది? ఎవరు నాశనం చేస్తున్నారు? దీనివల్ల కలిగే ఆనందం ఏమిటి? ఎందుకీ బంధాలు....?

పుట్టడం, పెరగడం, చావటం...అసలీ సృష్టిలేకపోతే ఏమయింది?

పుట్టడానికి బాధ........ చావడానికి బాధ.

మధ్యలో ఎన్ని యాతనలు? ఆశలు, నిరాశలు, ప్రేమలు, అప్యాయతలు, ద్వేషాలు, అసూయలు, పదవులు, గెలుపులు, ఓటమిలు, మోహాలు, వ్యామోహాలు.... ఎన్ని? ఎన్ని? ఎన్ని?

ఇంటిముందు చచ్చిపోయిన మనిషి చుట్టూ అంతమంది ఎందుకు? ఎవరింటిలోనైనా పిల్లాడు పుడితే అంతమంది పోగవరు కదా! మరి చస్తే ఎందుకలా తీర్థ ప్రజలా గుమిగూడుతారు?

తర్వాత కార్యక్రమాల హడావుడి. అందరూ చేస్తున్నారు. ఎవరికీ ఎవరూ పురమాయించడం లేదు. దేవుడి పెళ్లికి అంతా పెద్దలే.

ఇది పెళ్లా? కాదు చావు.

పార్వతీశంగారి పెళ్లికి అంతా పెద్దలే.... ఛీ ఛీ .... చావుకి.

రమణమూర్తికి నవ్వు వచ్చింది.

'పాడి కట్టారా?' —— కట్టారు.

'కుండ .... కొత్త కుండ తెచ్చారా?' తెచ్చారు.

'ఇంకా ఏం తెచ్చారు?' అన్నీ తెచ్చారండీ బాబూ ——

'కోడలు.... పెద్ద కోడల్ని పిలవండి నిప్పు చెయ్యాలి ——'

'ఉన్నది ఒక్కతే కోడలు—— ఆమె లేదు. పురిటికెళ్లింది.'

'అయ్యో లేదా?—— ఎలా?'

లేకపోతే ఏమయ్యింది? ఆ పని కోడలే చెయ్యాలని ఎక్కడ రాసుంది? నాకు చూపించండి.... ఎవడా రాసినవాడు? కోడలే చేసిందని పోయిన మనిషికి ఎలా తెలుస్తుంది?

ఈ పద్దులన్నీ రాయడానికి పైన ఎవరున్నారు? ఇలా ఎన్నని రాస్తాడు? ఆ పద్దుల్లో తప్పులుంటవా? మరి గవర్నమెంటు లెఖల్లో అన్నీ తప్పులే? ఎందుకలా? ఎవరో నిర్ణయిచేశారు....

కోడల్లేదుగా— ఫరవాలేదు. ఫలానా వాళ్ళు చెయ్యొచ్చని ఉంది.

ఎక్కడ వుంది?—

ఎవరిదీ జడ్జిమెంట్? జస్టిస్ అల్లాడా? జస్టిస్ సుబ్బారావా?.... ఎవరు?.... కాదు....కాదు.... పూర్ణయ్య సిద్ధాంతిగారు....

ఓహో కానివ్వండి....

ఎమెండ్మెంట్ నంబరు వన్....

మిగతా పన్నులన్నీ చకచకా సాగిపోయాయి.

రమణమూర్తి యాంత్రికంగా వాళ్ళ ఎలా చెప్తే అలాచేస్తున్నాడు అయిపోయింది— అంతా అయిపోయింది.

తండ్రి ఏ చెయ్యి పట్టుకుని తనని రోడ్లమ్మట, జీవితం మీదుగా ఒడుదుడుకుల్లేకుండా నడిపించాడో అదే చేత్తో ఆయన తలదగ్గర కొరివి పెట్టాడు.

ఆయన రూపం తనకింక కనబడదనుకున్నప్పుడు రమణమూర్తికి ఏడుపువచ్చింది.

ఘొల్లుమన్నాడు....

అలా అతను చాలా సేపు ఏడ్చాడు.

అంతా అతన్ని ఊరుకోబెట్టారు. మేన మామలు, తోడల్లుళ్ళు, పెదనాన్నలు ఎవరో.... ఎందరో....

'ఢాం....' ఏమిటిది?

'కపాలమోక్షం జరిగింది. ఇహ ఇంటికి నడు—' అంతే....

ఇంటికీ—ఇంకేముంది ఇక్కడ? ఇంటికెడితే మాత్రం ఏముంది?—

నాన్నలేడు.... నాన్నలేని అరుగు.... వెలవెలబోతూ....

'అంత్యకాలమందు ఎవడు నన్ను తలచునో—వాడు నన్ను చేరు తున్నాడు' గీతలో కృష్ణుడు చెప్పాడు.

అంత్యకాల మొక్కటే కాదు — ఊహ తెల్సినప్పట్నుంచీ అతని తండ్రి భగవానుణ్నే, తలుస్తున్నాడు.

సో.... ఆయన దేవుణ్ని చేరడం ష్యూర్....

అంతే ఈరోజు ఆయన! రేపు నువ్వు! ఎల్లుండి నేను! తర్వాత వాడు, వీడు, అది, ఇది.... అంతా అక్కడికే చేరుకుంటారు. మళ్లీ అక్కడకూడా ప్రేమలు, ఆప్యాయతలు, మోహాలు, ద్వేషాలు, బాధలు, మోసాలు, కొట్లాటలు.

ఛీ! వద్దు. అంతా అక్కడికి వద్దు.

కొందరక్కడికి.... కొందరు నరకానికి. కరెక్ట్.

నేనక్కడికే రామస్వామిగాడు నరకానికి .... వాడు పెద్ద దగుల్బాజీ, నాకు ప్రమోషన్ రాకుండా రికార్డు పాడుచేశాడు....

యస్.... మిస్టర్ రామస్వామి.... గో హెల్.... దటీజ్ ద రైట్ ప్లేస్ ఫర్ యూ....'

రమణమూర్తికి రెండోసారి నవ్వొచ్చింది.

వెంటనే తండ్రి గుర్తుకొచ్చాడు. తనని కనీసం కసురుకోకుండా, ఆప్యాయతను, ప్రేమను రంగరించి పెట్టిన మనిషి. తను చదువుకోసం దూరం వెడుతుంటే స్టేషనులో రైలు కదిలేదాకా నిలబడి .... కదుల్తున్న రైల్లోని తనను కన్నీళ్లతో చూచిన మనిషి.

ఇలా ఎన్నో! ఎన్నెన్నో.... ప్రేమ ప్రవాహం ఎండిపోయింది. పెద్దదిక్కు కూలిపోయింది.

కర్మ చేస్తున్నన్నాళ్ళు రమణమూర్తి ఇలానే ఆలోచించాడు. పార్వతీశం ప్రేతాః....

తన తండ్రి ప్రేతం అయిపోయాడా, మరి పోయేటప్పుడు వాసు దేవా అన్నాట్ట. మరి కృష్ణుణ్ని చేరుకోలేదా?

మరి ప్రేతాః ఎలా అవుతాడు?

అసలీ రామేశ్వర శాస్త్రికి సరిగా తెలుసా? ఎవరు అథారిటీ? సిద్ధాన్తులా? మహాపాతులా? ఎవరు?

తండ్రిపోయిన ఎనిమిదోరోజు రాత్రి ఒంటరిగా అరుగుమీద పడుకుని శూన్యంలోకి చూస్తున్న రమణమూర్తికి తండ్రి రోజూ నిద్ర పోయేముందు చదువుకునే గీతలోని శ్లోకం గుర్తుకొచ్చింది.

'జాతస్యహి ధ్రువో మృత్యు ర్ధ్రువం జన్మమృతస్యచ। తస్మాద పరిహార్యేర్థేనత్వం శోకిత మర్హసి'

అది తల్చుకున్నాక అతనికి మనసు ప్రశాంతంగా అనిపించింది. దుఃఖం తగ్గింది. అతను నిర్వికారుడిలా, యోగిలా అన్ని బంధాలను తెంచుకున్న తపస్విలా అనిపించాడు.

ఆ మర్నాడే రమణమూర్తికి కొడుకు పుట్టినట్టు అత్తవారింటి నుంచి కబురు వచ్చింది.

రమణమూర్తికి మూడోసారి నవ్వువచ్చింది. అతను గట్టిగా, పకపక హాయిగా నవ్వుకున్నాడు. అతనికి శ్లోకం గుర్తుకొచ్చింది.

'పుట్టినవానికి మరణము తప్పదు. మరణించినవానికి పుట్టుక తప్పదు. అనివార్యమగు ఈ విషయము గూర్చి శోకింప తగదు....'

శ్లోకం పైకి గట్టిగా చదివాడు. అందరూ కంగారుపడ్డారు.

'దేవుల్లాంటి నాన్న పోయాడు. నేను కుమిలిపోయాను. రేపు నేను పోతే నా కొడుకూ కుళ్లి కుళ్లి ఏడుస్తాడు. ఎందుకీ బంధాలు? అనివార్యమైన ఈ చావు పుట్టుకల గురించి ఎందుకు సుఖదుఃఖాలు? ఎందుకీ రాగద్వేషాలు? నేను పెంచుకోను' అన్నాడు.

అతనికి పిచ్చెక్కిందన్నారు. షాక్ తిన్నాడన్నారు. వేదాంతి అవుతున్నాడన్నారు. తర్వాత పదిరోజులు ఎవరెన్ని చెప్పినా కొడుకుని చూడ్డానికి వెళ్లనుగాక వెళ్లనన్నాడు. అందరూ బాధపడ్డారు. పిల్లనిచ్చిన మామగారు గుడ్లనీళ్ళు కుక్కుకున్నాడు. పెద్దవాళ్ళు ముక్కుమీద వేలేసుకున్నారు. అతని భార్యని, పుట్టిన పిల్లాణ్ని తల్చుకుని జాలిపడ్డారు.

చివరికంతా పెదవి విరిచారు.

* * *

మూణ్నెల్ల తర్వాత బెజవాడ స్టేషన్లో ఓ ఎక్స్‌ప్రెస్ రైల్లో ఫస్ట్ క్లాస్ కూపేలో పైబెర్తు మీద పడుకుని వున్న ఒకతను కింద బెర్తుమీద చంటిపిల్లాణ్ని ఒళ్లో పెట్టుకుని కూర్చున్న భార్యతో 'రైలు కదిలాక చంటాణ్ని పడుకోబెట్టి చలిగాలి తగలకుండా రగ్గు కప్పి నువ్ పైకి రా' అన్నాడు.

అతని పేరు రమణమూర్తి. (విపుల–జనవరి 1981)

—(అయిపోయినది)—